క్లుప్తంగా

'దోస్త్' దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

సదాశివపేట(సంగారెడ్డి): డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దోస్త్ 2024–25 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తాడేపల్లి పతాంజలి బుధవారం తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంపీసీ, బీఎస్సీ, బీజెడ్సీ కంప్యూటర్ కోర్సుల్లో అడ్మిషన్ల గురించి నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. మే 25 తేది వరకు దోస్త్ ద్వారా అన్‌లైన్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత దోస్త్ రిజిస్ట్రేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పతంజలి అన్నారు. ఇతర వివరాలకు అకాడమిక్ కోఆర్డినేటర్ ఆంగ్ల ఉపన్యాసకులు వినాయకరావు 94417365 28 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'బీజేపీని ఓడిస్తేనే దేశానికి విముక్తి'



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: కేంద్రంలోని బీజేపీని ఓడిస్తేనే దేశానికి విముక్తి లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. ఆ పార్టీ జిల్లా జిల్లా కార్యాలయం కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో ముద్రించిన 'బీజేపీ బంధీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం' బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ మోడీ పాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక వాదం, సమాఖ్య వ్యవస్థలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ఇండియా కూటమి వేదికలో భాగస్వామ్యమైన కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం, అతిమెల మానిక్, అఫీసు కార్యదర్శి కృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నాను.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి



గునుకులకుంటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: ఓటర్లంతా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి సూచించారు. ఖేడ్ మండల పరిధిలోని గునుకులకుంట, మాధ్వార్ తండాల్లో నూతనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆయాచోట్ల బుధవారం గ్రామసభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దారు భాస్కర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ రాజు, బీఎల్వోల సూపర్‌వైజర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి పద్మారావు, బీఎల్వో ఇంద్రలత, ఎన్నికల విభాగం ఆపరేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి సహకరించాలి

మునిపల్లి(అందోల్): ఎంపీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ అధికారులతో పాటు ఎన్నికల అధికారులకు సహకరించాలని ఎంపీడీఓ హరినందన్‌రావు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా గ్రామాలకు వచ్చిన అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎంపీఓ నాగలక్ష్మితో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సొంత గూటికి బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్: ఇటీవల బీజేపీలో చేరిన నిజాంపేట్ మండలం మేఘ్యానాయక్ తండా, రామ్‌ధన్ తండా, సిర్గాపూర్ మండలం కడ్పల్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తిరిగి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలను నమ్మొద్దని సూచించారు. బీఆర్ఎస్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఖేడ్ పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- డీఎస్పీ కార్యాలయ పరిధిలో 267 మంది బైండోవర్
- సబ్ డివిజన్‌లోని 7 పోలీస్‌స్టేషన్స్ పరిధిలో బైండోవర్ కేసులు: 191
- ఎన్నికల ముందు నాన్ బెయిల్‌ఎబుల్: 19
- డిపాజిట్ చేసిన తుపాకులు: 14
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులు: 01
- నగదు రవాణాలో రూ.37, 58 లక్షలు సీజ్



పటాన్‌చెరు టౌన్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ఇప్పటికే పోలీసు అధికారులు ప్రకటించారు. ఎన్నికల బరిలో నిలిచిన వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు సైతం నిబంధనల ప్రకారం ప్రచారాన్ని నిర్వహించేవిధంగా సూచనలు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఇప్పటికే పాత నేరస్తులు, రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. పోలీసు కవాతులో భాగంగా ప్రతిఒక్కరూ ధైర్యంగా ఓటు వేయాలని అవగాహన ర్యాలీలు సైతం నిర్వహించారు.

సబ్ డివిజన్ పరిధిలో...

పటాన్‌చెరు సబ్ డివిజన్ పరిధిలోని అమీన్‌పూర్, భానుర్– బీడీఎల్, జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం, పటాన్‌చెరు, హత్నూర సంబంధించిన పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ప్రశాంతంగా నిర్వహించేలా ముందస్తు చర్యలు చేపట్టారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా అన్నివిధాలు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 67 లిక్కర్ కేసుల్లో 1184 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నగదు రవాణాలో సరైన పత్రాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.37, 58లక్షల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు

ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని నిరోధించడానికి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులతో పాటు ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత టోల్‌గేట్ వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం ఎన్నికల నిబంధనలు పాటించేవిధంగా చూస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ఇప్పటికే ఉల్లంఘనపై ఓ పార్టీపై కేసు నమోదు చేశాం. ఎన్నికల నిర్వాహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.
డీఎస్పీ రవీందర్‌రెడ్డి, పటాన్‌చెరు

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

రోడ్డుపై రైతుల బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

హత్నూర (సంగారెడ్డి): పండించిన ధాన్యాన్ని రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడంలేదని ఆగ్రహించిన రైతులు మండల పరిధిలోని చింతలచెరువులో రోడ్డుపై బైఠాయించి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా ఎందుకు తూకం వేయడం లేదంటూ ప్రశ్నించారు. అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ధాన్యంను త్వరాగా కొనుగోలు చేసేవిధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

కార్మికులకు అండగా ఉంటాం

- ఇటుక బట్టీల యజమానులపై కేసులు నమోదు చేయాలి
- సీఐటీయూ నాయకుల డిమాండ్



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండల కేంద్రంలోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు అండగా ఉంటామని, కార్మికులను శ్రమదోపిడీ చేస్తున్న ఇటుక బట్టీల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న యాజమాన్యాలు కార్మికులకు రక్షణ కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకొని సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారన్నారు. బట్టీల్లో పని చేయకపోతే రూముల్లో బంధించి చిత్రహింసలు పెడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఇటుక బట్టీల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేష్, యాదయ్య, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలపై నిలదీయండి

- ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలపై ఆ పార్టీ నాయకులను నిలదీయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ జహీరాబాద్ పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటుతున్నా హామీల అమలు ఊసేత్తడంలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగతా వాటిని ఎందుకు పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో లబ్ది పొందడానికి దేవుళ్లపై ఒట్టు వేసి పథకాలను వాయిదా వేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, నియోజకవర్గం ఇన్‌చార్జి దేవిప్రసాద్, నాయకులు షేక్‌ఫరీద్, నామ రవికిరణ్ గుప్తా, తంజీమ్, గుండప్ప, యాకూబ్, అబ్దుల్లా, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని జంగంపేట, జిన్నారం, సోలక్‌పల్లి, రాళ్లకత్వ తదితర గ్రామాల్లో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిని సాధించిందన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్, కోనాపూర్ తదితర గ్రామాల్లో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు మద్దికుంట శేఖర్, నరేష్‌గౌడ్, నాగేష్, శంకర్, నరేష్, నవీన్, మల్లేశం, కమలహాసన్, ప్రభాకర్, రాజు, సంగమేశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు గడువు పొడిగింపు

పటాన్‌చెరు టౌన్: పోస్టల్ బ్యాలెట్ గడువు ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర ఎన్నికల అధికారి సూచన మేరకు పొడిగించినట్లు పటాన్‌చెరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దేవుజా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

జోగిపేటలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

జోగిపేట(అందోల్): ఎంపీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరుతూ జోగిపేట పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. జోగిపేటలో ప్రత్యేక పోలీసు బలగాలతో ప్రధాన వీధుల గుండా బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ఓటర్లు భయభ్రాంతులకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని, ప్రజల్లో ధైర్యం కల్పించేవిధంగా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, ఏఎస్‌ఐ గౌస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

ఆ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్‌లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరిన్ని హామీలు అమలు అవుతాయన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్న ముదిరాజ్, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు మదాస్ రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి

పటాన్‌చెరు టౌన్: దేశాన్ని తాకట్టు పెడుతున్న బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య పిలుపునిచ్చారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకులు వీఎస్ రాజు, మల్లేశం, ఏడుకొండలు, లాఖాన్, జైపాల్, రాములు, వెంకట్, మహేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, విఠల్, బిలాల్, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీలం మధుకు మద్దతుగా ప్రచారం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్, నందికంది, పెద్దాపూర్ తదితర గ్రామాల్లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఒగ్గు శ్రీనివాస్, కృష్ణ, ఖలీల్, రాముగౌడ్, లక్ష్మణ్, నాగేష్, జగదీష్, చింటూగౌడ్, కుమార్‌గౌడ్, ప్రకాష్, భిక్షపతి, కృష్ణచారి, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం పట్టణంలో...

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రామచంద్రాపురం పట్టణంలో ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేటర్ శ్యామ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు సమక్షంలో పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి నీలం మధు కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హస్తం గూటికి బీఆర్ఎస్, బీఎస్పీ నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బొప్పన్‌పల్లి గ్రామానికి చెందిన రాజు, రాములు, సల్మాన్‌తో పాటు పలువురు నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సునితాపాటిల్, పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, గ్రామ నాయకులు షకీల్, అమృత్, నాగేష్, బాలయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కురిసిన వర్షం



ఝరాసంగంలో కురుస్తున్న వర్షం



పెద్దమ్మగూడలో నేలకొరిగిన వరి చేను

ఝరాసంగం(జహీరాబాద్): మండల కేంద్రంలో బుధవారం జోరుగా వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో సాయంత్రం సమయంలో బలమైన గాలులు వీస్తూ వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి చల్లబడింది. ఆకాశంలో వెల్లు విరిసిన ఇంద్రధనస్సు ప్రతిఒక్కరినీ కనువిందు చేసింది.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో కురిసిన వర్షానికి వరితో పాటు కూరగాయ పంటలకు నష్టం వాటిల్లింది. జిన్నారం, పెద్దమ్మగూడ, జంగంపేట, గుమ్మడిదల, బొంతపల్లి, అనంతారం గ్రామాల్లో కల్లాల్లోని వడ్లు నీటికి తడిసి ముద్దయ్యాయి.

సంక్షిప్త వార్తలు

◆ **కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ**

జహీరాబాద్ టౌన్: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ పట్టణంలో కొనసాగుతోంది. జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల10 వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 1730 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 258 మంది ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మిగిలిన వారు కూడా ఓటుహక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

◆ **బీజేపీ ఇంటింటి ప్రచారం**

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని అనంతసాగర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో విస్తరక్ వీరమణి, మండల అధ్యక్షుడు దశరథ్, బీజేపీ ఐటీ సెల్ జిల్లా నాయకులు బాయిని శ్రీనివాస్, దశరథ్, సచిన్, పండరి, రాములు, రమేష్, లాలు తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ నేతల ప్రచారం**

జిన్నారం: గుమ్మడిదల గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి రాఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

◆ **బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి**

మునిపల్లి(అందోల్): బీజేపీ ఎంపీ బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మండల నాయకులు తాటిపల్లి రాజిరెడ్డి ఆధ్వర్యంలో తాటిపల్లి, చిన్నచల్మెడ, పిల్లోడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు గొల్ల శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న సామాజిక తనిఖీ**

కంది(సంగారెడ్డి): మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ కొనసాగుతోంది. ఎప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు చేపట్టిన ఉపాధిహామీ పనులపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. పనుల వివరాలు, చెల్లించిన డబ్బుల వివరాలను విలేజ్ ఆడిటర్లు కూలీల నుంచి సేకరిస్తున్నారు. తనిఖీ చేసే ముందు గ్రామసభలు నిర్వహించి ఆ గ్రామాల్లో చేపట్టిన పనులు, లబ్ధిదారుల వివరాలను వెల్లడిస్తున్నారు. ఈ నెల 9వరకు తనిఖీ నిర్వహించి విలేజ్ ఆడిటర్లు గ్రామాల వారీగా నివేదికలను రూపొందించి అధికారులకు అందజేస్తారు. ఈ నెల10న ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో జిల్లా అధికారుల ముందు తనిఖీ నివేదికలను చదివి వివరించనున్నారు.

◆ **బీజేపీలో చేరిక**

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని మందగుబ్బడి తండావాసులు ఆ పార్టీ ఇన్‌చార్జి విజయ్ మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్నాథ్, వీరారెడ్డి, సుభాష్, ఉమేష్‌లాల్, రూప్‌సింగ్, మధు చౌహాన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన షేక్ సుభాని బతుకు దెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఉంటూ నాదెండ్ల కృష్ణకిషోర్ రెసిడెన్షియల్ భవనం వద్ద ఐరన్ బెండింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ నెల 6వ తేదీ ఉదయం పనిచేసేచోట రెండో అంతస్తు స్లాబ్ పనులు పూర్తి కావడంతో మెటీరియల్‌ను పైనుంచి కిందకి పడేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్ఎంసీ పైపు షేక్ సుభానిపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం పటాన్‌చెరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధికూలీల చుట్టూ నేతల ప్రదక్షిణలు



ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోటాపోటీగా ఎన్నికల ప్రచారం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఎండలు దంచి కొడుతుండడంతో ఉదయం పూటే ఉపాధిహామీ పనులకు వెళ్తున్న కూలీల వద్దకే నాయకులు పరుగెడుతున్నారు. వారం రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పోటీలు పడి ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం చేస్తున్నారు. ఎండవేడి నివారణకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ నీటిని అందిస్తూ పనిలో పనిగా తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇలా జిల్లాలోని అన్ని గ్రామాల్లో రోజుకో పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. సాయంకాలం వేళల్లో గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

సభలకు వెళితే రూ.300

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తమ సభలకు, రోడ్డు షో, కార్నర్ మీటింగ్‌లకు వచ్చే వారికి రూ.300 ఇస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లి సాయంత్రం ఎన్నికల సభలు, సమావేశాలకు వెళ్తున్నారు. దీంతో వారికి కొంత ఉపాధి లభిస్తోంది.